యువతకు వృత్తి నైపుణ్యంలో ఉచిత శిక్షణ

మెదక్ మున్సిపాలిటీ, జూలై 13: జిల్లాలోని నిరుద్యోగ యువతకు వృత్తి నైపుణ్యంలో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు జిల్లా యువజన, క్రీడల శాఖాధికారి నాగరాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మెదక్‌లోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలోని శిక్షణ కేంద్రంలో ఫ్యాషన్ డిజైనింగ్, బ్యూటీషియన్, కంప్యూటర్, సీసీ, టీవీ రిపేర్, కంప్యూటర్ హార్డ్‌వేర్, ఎలక్ట్రికల్ హౌజ్ వైరింగ్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. త్వరలో 9వ బ్యాచ్ ప్రారంభిస్తున్నట్లు, ఆసక్తి గల యువత ఈ నెల 20వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రతి బ్యాచ్‌లో 30 మంది అభ్యర్థులకు అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఎంపికైన వారికి 3 నెలల ఉచిత శిక్షణ ఇవ్వబడుతుందన్నారు. 7396313741 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

డిగ్రీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

రామాయంపేట, జూలై 13: రామాయంపేట గురుకుల డిగ్రీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లకు నేటి నుంచి 17వ తేదీ వరకు విద్యార్థులు నేరుగా దరఖాస్తు చేసుకోవాలని మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శిరీష ఒక ప్రకటనలో శనివారం పేర్కొన్నారు. ఇంటర్‌లో ఉత్తీర్ణులైన విద్యార్థులు వచ్చి స్పాట్ అడ్మిషన్లు పొందవచ్చని తెలిపారు.

మాడల్ స్కూల్‌ను సందర్శించిన ఫుడ్ ఇన్‌స్పెక్టర్

కళాశాల వసతి గృహాన్ని సందర్శించిన ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తౌర్యా నాయక్

రామాయంపేట, జూలై 13: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని, లేకుంటే చర్యలు తప్పవని ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తౌర్యా నాయక హెచ్చరించారు. శుక్రవారం రాత్రి రామాయంపేట మాడల్ వసతి గృహానికి చేరుకుని పరిసరాలను పరిశీలించారు. ఇటీవల వసతి గృహంలో విద్యార్థులకు అందించే భోజనంలో బల్లి పడడంతో అనారోగ్యానికి గురయ్యారు. ఈ విషయంలో కలెక్టర్ ఆదేశాలతో పాఠశాలలో తనిఖీ చేసినట్లు తెలిపారు. ఆయన వెంట వసతి గృహం ప్రత్యేకాధికారి అనురాధ ఉన్నారు.

బ్యాటరీల చోరీ

చిన్నశంకరంపేట, జూలై 13: దుండగులు మూడు ట్రాక్టర్ల బ్యాటరీలు ఎత్తుకెళ్లినట్లు ఎస్సై నారాయణ శనివారం తెలిపారు. కొర్విపల్లికి చెందిన ఎల్లం, శ్రీకాంత్, మరో రైతు శుక్రవారం సాయంత్రం పొలాలు దున్ని వారి ట్రాక్టర్లను పొలం వద్ద ఉంచి ఇంటిళ్లారు. శనివారం ఉదయం ట్రాక్టర్లు తీసుకెళ్లడానికి వచ్చిన వారు బ్యాటరీలు చోరీకి గురైనట్లు గుర్తించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేసినట్లు ఎస్సై తెలిపారు.

శాంతియుతంగా మొహర్రం జరుపుకోవాలి

కొల్చారం, జూలై 13: ఈ నెల 17న మొహర్రం, తొలి ఏకాదశి వస్తున్నాయని, ప్రజలు శాంతియుతంగా జరుపుకోవాలని మెదక్ రూరల్ సీఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. శనివారం కొల్చారం పోలీస్‌స్టేషన్‌లో మండల ప్రజలతో సమావేశం నిర్వహించారు. మతాలకతీతంగా పండుగలను సోదరభావంతో జరుపుకోవాలన్నారు. గతంలో బక్రీద్ పండుగ సమయంలో మెదక్‌లో జరిగిన ఇరువర్గాల ఘర్షణను దృష్టిలో ఉంచుకుని అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో ఎస్సై గౌస్ పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WATER PROOFING

★ Roof & Wall Crack Filling, Water Proofing Coatings, New & Old Bhathrooms Leakages, Water Tank & Sump Leakages, Rain Coat & Pest Control, Slab & Beems Injection Work, 10 years Waranty. Call: 9010425273, 8121425273.
NT-326124

PLOT FOR SALE

★గజ్వేల్ టౌన్ మెయిన్ రోడ్, SBI దగ్గర 161 చ.గ. ఇంటి స్థలం అమ్మబడును. వివరాలకు సంప్ర: 8143366630 / 9989554915.
NT-325881

TOURS & TRAVELS

★మహాదేవ టూర్స్: 6th నవంబర్-కార్తీక మాసంలో కాశీ+12 క్షేత్రాలు. Ac Bus 20 స్లీపర్+20 సిట్టింగ్ 15 రోజులు. చార్‌ధాం 20th, సెప్టెంబర్ 3rd Ac. సంప్రదించండి: 9676637578.
NT-339536-All

WANTED TEACHERS

★Computer Teachers Wanted immediately, Gajwel GDR & St. Mary's School. B.Com., B.Sc., & B.Tech., Candidates. Call: 9059627376.
NT-97860

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

పేద విద్యార్థులంటే ఇంత నిర్లక్ష్యమా?

- కాంట్రాక్టర్‌ను తక్షణమే తొలిగించండి
- వసతి గృహం ఎదుట విద్యార్థులతో తల్లిదండ్రుల ధర్నా
- పరిసరాలను బాగుచేయిస్తానని హామీ ఇచ్చిన ఆర్‌సీవో భీమయ్య

మాట్లాడుతున్న రీజనల్ కో ఆర్డినేటర్ భీమయ్య

గురుకుల పాఠశాలలో ఆందోళన చేస్తున్న విద్యార్థినుల తల్లిదండ్రులు

రామాయంపేట, జూలై 13: 'మా పిల్లలతో రోజూ టాయిలెట్లు కడిగిస్తారా.. ఇంత అధ్వానంగా బాత్రూమ్‌లు ఉంటే ఎలా? పిల్లలపై ఎలుకలు దాడి చేసినా సమాచారం ఎందుకు ఇవ్వలేదు. పేద విద్యార్థులంటే ఇంత నిర్లక్ష్యమా? తక్షణమే సంబంధిత కాంట్రాక్టర్‌ను తొలిగించండి లేదంటే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తాం' అని గురుకుల వసతి గృహం ఎదుట విద్యార్థుల తల్లిదండ్రులు శనివారం ధర్నా చేశారు. టీఎస్ గురుకులంలో పేరెంట్స్ కమిటీ సమావేశానికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థుల తల్లిదండ్రులు టీచర్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే సంబంధిత టీచర్లను తొలిగించాలని డిమాండ్ చేశారు. వసతులు కల్పించడంలో సిబ్బంది పూర్తిగా విఫలమయ్యిందని ఆరోపించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందడం లేదన్నారు. పాఠశాలలో 600 మంది విద్యార్థులకు ఇద్దరు అటెండర్లతో పనులు చేయించడం సరికాదన్నారు. గురుకుల ఆవరణంతా చెత్తా చెదారంతో నిండినా పట్టించుకోరా అని ప్రశ్నించారు. రోజూ రాత్రి ఎలుకలు, పొద్దంతా శునకాలు, పాములతో తమ పిల్లలు సహవాసం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రెండు గంటల పాటు పేరెంట్స్ ఆందోళన చేయడంతో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ పద్మ ఎంత సముదాయించినా ఆందోళన విరమించలేదు.

కాంట్రాక్టర్‌ను వెంటనే తొలిగించాలి: పేరెంట్స్ కమిటీ

మూడేండ్ల కాలంగా గురుకులానికి ఒకే కాంట్రాక్టర్ ఉండడం సరికాదన్నారు. వెంటనే టెండర్లు వేసి పనిచేయని కాంట్రాక్టర్‌ను తొలిగించాలని విద్యార్థుల తల్లిదండ్రులు రాష్ట్ర రీజినల్ కో ఆర్డినేటర్ దృష్టికి తెచ్చారు. చుట్టూరా చెట్ల పొదల మూలంగా రోజూ పాములు, ఎలుకలు, కుక్కలతో తమ పిల్లలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. విద్యార్థులతో పని చేయిస్తున్న సంబంధిత టీచర్లకు నోటీసులిచ్చి తొలిగించాలని డిమాండ్ చేశారు.

సిబ్బందిపై చర్యలు తీసుకుంటా: రాష్ట్ర గురుకులాల రీజినల్ కో ఆర్డినేటర్ భీమయ్య

విద్యార్థులపై ఎలుకలు దాడి చేయడం సహించరాని విషయం. అందుకు బాధ్యులపై చర్యలు చేపడుతామని విద్యార్థుల తల్లిదండ్రులకు ఆర్సీవో భీమయ్య హామీ ఇచ్చారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఇప్పటికే కొంతమంది టీచర్లకు నోటీసులిచ్చామన్నారు. అనారోగ్యంతో ఉన్న ప్రిన్సిపాల్‌కు సెలవులు మంజూరు చేశామన్నారు.

జైన దేవాలయంలో చతుర్మాస దీక్షలు

- ఆచార్య అంతర్మణ 108 ప్రసన్నసాగర్ మునిమహరాజ్
- దర్శించుకున్న ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, ఎమ్మెల్యే సునీతారెడ్డి

కొల్చారం జైన మందిరంను దర్శించుకుంటున్న ఎమ్మెల్సీ శేరిసుభాష్‌రెడ్డి,ఎమ్మెల్యే సునీతారెడ్డి

స్వాములను దర్శించుకుంటున్న నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి

కొల్చారం, జూన్ 13: కొల్చారంలోని జైన దేవాలయం 23వ తీర్థంకరుడు పార్శ్వనాథ ఆలయానికి ఆధ్యాత్మిక శోభ సంతరించుకున్నది. శనివారం జైన దేవాలయంలో ఆచార్య అంతర్మణ 108 ప్రసన్నసాగర్ మునిమహరాజ్‌తో పాటు 17మంది దిగంబర జైన మహరాజ్‌లంతా మహారాష్ట్రలోని కోలాపూర్, బెంగళూరు, హైదరాబాద్ మీదుగా కొల్చారం చేరుకున్నారు. నాలుగు నెలలపాటు ఉపవాస దీక్షలో భాగంగా స్వాములు జైన మందిరానికి వచ్చారు. స్వాములను దర్శించుకోవడానికి వచ్చిన ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి వారికి ఘన స్వాగతం పలికారు. జైన మందిరంలో ఆదివారం నుంచి మూడు రోజులపాటు ప్రత్యేక ఉత్సవాలు జరుగనున్నాయి. నవంబర్ మూడో తేదీ వరకు ప్రసన్నసాగర్ మహరాజ్ ఇక్కడే ఉండి ప్రజలకు ఆశీర్వాదం ఇస్తారని ఆలయ అధ్యక్షుడు సుమేశ్‌చందుజైన్, ఆలయ కార్యదర్శి, ఉపాధ్యక్షుడు కాలా మహేందర్‌కుమార్ జైన్ (ట్రస్ట్ మెంబర్), రామకృష్ణ, ప్రసాద్ తెలిపారు. స్వామిని దర్శించుకున్న వారిలో మెదక్ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ కరెంట్ రాజాగౌడ్, సీడీసీ మాజీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ లింగొల్ల చెన్నయ్య, బీఆర్ఎస్ నాయకులు చిట్యాల యాదయ్య, సాయిని సిద్ది రాములు, గ్యాస్ కృష్ణ, పాండు వెంకటేశం తదితరులు ఉన్నారు.

దుర్గమ్మ సేవలో మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి

పాపన్నపేట, జూలై 13: ఏడుపాయల వనదుర్గామాతకు మెదక్ మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్‌రెడ్డి శనివారం ప్రత్యేక పూజలు చేశారు. వేదపండితులు అర్చనలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు దుర్గాదాస్, వెంకోబా, యాదవ సంఘం మండల అధ్యక్షుడు గోపాల్ ఉన్నారు.

కోర్టు ఆర్డర్ ధిక్కరించి.. హద్దులు ధ్వంసం చేసి

భూమి చుట్టూ ఏర్పాటు చేసిన ప్రహరీ పక్కన లబ్ధిదారుడి పట్టా పాసుబుక్

కాంపౌండ్ వాల్ నిర్మించి, దర్జాగా కబ్జా న్యాయం చేయాలని బాధితుడి వేడుకోలు

మెదక్, జూలై 13 (నమస్తే తెలంగాణ): కోర్టు ఆర్డర్ ధిక్కరించి, తమ భూమి హద్దులు ధ్వంసం చేసి, కాంపౌండ్ వాల్ నిర్మించి, తమ భూమిలో దర్జాగా కబ్జాకు పాల్పడ్డారని మనోహరాబాద్ మండలం కాళ్లకల్ గ్రామానికి చెందిన వర్గంటి అనంతరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అనంతరెడ్డి మాట్లాడుతూ కాళ్లకల్ గ్రామంలోని సర్వే నంబర్ 492లో 1.20 గుంటల భూమి ఉన్నదన్నారు. ఆ భూమిని తాను కాస్తు చేస్తున్నాని తెలిపారు. ఈ భూమికి సంబంధించిన పాస్ బుక్కు కూడా తన పేరుపైనే ఉన్నదన్నారు. గతంలో అదే గ్రామానికి చెందిన వర్గంటి మోహన్‌రెడ్డి, వర్గంటి కిష్టారెడ్డి తన భూమిలోకి వచ్చి హద్దులు ధ్వంసం చేశారని, ఈ విషయంలో 2018లో మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశానన్నారు. ఈ కేసులో వారిద్దరూ నేరం అంగీకరించినందున గజ్వేల్ జూనియర్ సివిల్ జడ్జి రూ.500 చొప్పున జరిమానా కూడా విధించారన్నారు. వీరిద్దరు మళ్లీ అక్రమంగా తన భూమిలోకి వచ్చి తనను, తన కుటుంబీకులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని, దీంతో 2023 డిసెంబర్‌లో మెదక్ జూనియర్ సివిల్ జడ్జిని ఆశ్రయించినట్లు తెలిపారు. మెదక్ కోర్టు ఇన్‌జక్షన్ ఆర్డర్ కూడా ఇచ్చిందన్నారు. వర్గంటి కిష్టారెడ్డి, వర్గంటి భరత్‌రెడ్డి, వర్గంటి మోహన్‌రెడ్డి, వర్గంటి రవీందర్‌రెడ్డి ఈ నెల 9న మళ్లీ తమ భూమిలోకి దౌర్జన్యంగా వచ్చి రాత్రికి రాత్రేజేసీబీ, ట్రాక్టర్లతో హద్దులు ధ్వంసం చేసి, ప్రహారీని నిర్మించారని ఆవేదన వ్యక్తం చేశారు. దీని పై ఈ నెల 10న పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు కూడా చేసినట్లు తెలిపారు. ఈ విషయంలో మనోహరాబాద్ ఎస్సై సుభాష్‌గౌడ్‌ను వివరణ కోరగా.. ఇరు వర్గాలను పిలిపించి మాట్లాడానన్నారు. ఆ భూమిలోని 8 గుంటల పంచాయితీ ఉన్నదన్నారు. ఆ విషయంలో పెద్దల సమక్షంలో కూర్చొని మాట్లాడుకోవాలని తెలిపానన్నారు.

నర్సాపూర్, జూలై 13: నర్సాపూర్ రాయరావు చెరువు కట్టపై యోగాసనాలు చేయిస్తున్న తెలంగాణ యోగా టీచర్స్ ఆలయన్స్ కమిటీ, హైదరాబాద్ శాఖ కోశాధికారి బుస్సా చంద్రశేఖర్‌గుప్తా, యోగా టీచర్లు, ఉపాధ్యాయులు తదితరులు

పాతూరులో ట్యాంకర్ ద్వారా నీటి సరఫరా

మెదక్ మండలంలో నీటి గోస

మెదక్‌రూరల్, జూలై 13: మండలంలోని వెంకటపూర్, పేరూరు, పాతూరు, పలు గ్రామాల్లో మిషన్ భగీరథ ఉన్నప్పటికీ తాగునీరు రాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. భూగర్భ జలాలు వట్టి పోవడంతో బోర్ల నుంచి నీరు రావడంలేదు. నీటికి తమ గ్రామాల్లో తిప్పలు పడుతున్నామని అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నీటి ఎద్దడిని నివారించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అక్రమంగా కేసు బనాయించడం సరికాదు

మాట్లాడుతున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

మెదక్ మున్సిపాలిటీ, జూలై 13: తపస్ జిల్లా అధ్యక్షుడు ఎల్లంపై అక్రమంగా కేసు బనాయించడం సమంజసం కాదని పలు ఉపాధ్యాయ సంఘాలు ఖండించాయి. ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు రాజగోపాల్‌గౌడ్, టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సంగయ్య, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పద్మారావు, తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, పెట్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ శనివారం మెదక్‌లో మాట్లాడారు.

పారిశుధ్య కార్మికులను ఏర్పాటు చేయాలి

రామాయంపేట, జూలై 13: ప్రభుత్వ పాఠశాలల్లో పారిశుధ్య కార్మికులను ఏర్పాటు చేయాలని టీఆర్‌టీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఐరేని రవీందర్‌గౌడ్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పాఠశాలల్లో పారిశుధ్య కార్మికులు లేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తున్నదన్నారు. పాఠశాలల్లో పరిశుభ్రత పూర్తిగా లోపిస్తున్నదన్నారు.

అక్రమంగా మట్టి తరలిస్తున్న టిప్పర్ల పట్టివేత

తూప్రాన్, జూలై 13: అక్రమంగా మట్టి తరలిస్తున్న రెండు టిప్పర్లను తూప్రాన్ పోలీసులు పట్టుకున్నారు. శుక్రవారం రాత్రి బంగ్లా వెంకటాపూర్ నుంచి తూప్రాన్ మున్సిపాలిటీ పరిధిలోని అల్లాపూర్ మీదుగా అనుమతులు లేకుండా తూప్రాన్‌కు మట్టిని తరలిస్తున్నారు. అభ్యాస స్కూల్ సమీపంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న ఎస్సై-2 యాదగిరి తన సిబ్బందితో కలిసి మట్టి తరలిస్తున్న వాహనాలను తనిఖీ చేశారు. వాటిని ఆపి, అనుమతి పత్రాలు అడగగా ఎలాంటి పత్రాలు లేవని డ్రైవర్లు బోడ రమేశ్, పుట్ట మహేశ్ తెలిపారు. ఆ వాహనాలను సీజ్ చేసి తూప్రాన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. డ్రైవర్లతో పాటు, టిప్పర్ల యజమాని వెంగలి శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శివానందం తెలిపారు.

4 కిలోల కణితి తొలిగింపు

పాపన్నపేట, జూలై 13: రెండేండ్ల నుంచి ఇబ్బంది పడుతున్న మహిళ కడుపులో నుంచి 4 కిలోల అండాశయ కణితిని మెద క్ దవాఖానలో ఆపరేషన్ చేసి వైద్యులు తొలిగించారు. పాపన్నపేట మండలం దౌలపూర్ గ్రామానికి చెందిన 50 ఏండ్ల మహిళకు శనివారం మెదక్ దవాఖానలో వైద్య పరీక్షల అనంతరం ఆపరేషన్ చేసినట్లు డాక్టర్లు పిప్పరి చంద్రశేఖర్, వీణ, నందకిశోర్ తెలిపారు. మహిళ కోలుకుంటుందన్నారు.

నర్సాపూర్‌లో రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న రైతులు

కొనసాగుతున్న రైతుల రిలే నిరాహార దీక్ష

నర్సాపూర్, జూలై 13: కొండపోచమ్మ సాగర్ నుంచి వచ్చే కాల్వ నిర్మాణంలో భూములు కోల్పోతున్నామని నర్సాపూర్ రైతులు చేపట్టిన రిలే నిరాహార దీక్ష రెండో రోజు కొనసాగింది. మండలంలోని బ్రాహ్మణపల్లి, చిన్న చింతకుంట గ్రామాలకు చెందిన భూనిర్వాసితులు శనివారం రిలే నిరాహార దీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ కొండపోచమ్మ సాగర్ నుంచి సంగారెడ్డి వరకు నిర్మించే కెనాల్ కోసం తమ విలువైన భూములు కోల్పోతున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. భూములు కోల్పోతున్న తమకు భూమికి బదులు భూమి ఇవ్వాలని లేదా ఎకరానికి రూ.60 లక్షల నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం దిగొచ్చే వరకు ఈ దీక్షలు కొనసాగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రైతులు ప్యాట మహేశ్‌గౌడ్, యాదాగౌడ్, కొండల్, రామకృష్ణ యాదిరెడ్డి, శశికుమార్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వారాహీ నవరాత్రి ఉత్సవాలు



వారాహీదేవీగా మహంకాళి అమ్మవారు

చేగుంట, జూలై 13: చేగుంటలోని మహంకాళి దేవాలయంలో వారాహీ నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. శనివారం ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని వివిధ రకాల పుష్పమాలలతో పూజారి రఘు వేంద్రశర్మ ఆలంకరించారు. 8వ రోజు వారాహీదేవీగా దర్శనమిచ్చింది. ఆలయంలో గణపతి పూజ, అమ్మవారికి సుగంధ ద్రవ్యాలు, పరిమళపత్ర పుష్పాలతో అభిషేకించారు. అనంతరం తీర్థప్రసాద వితరణ, ఆశీర్వచనాలు, అన్నదానం చేశారు. కార్యక్రమంలో అమరావతి ఆగం, చేగుంట వనిత వాసవి క్లబ్ జోన్ చైర్మన్లు సంధ్యరాణి పరంజ్యోతి, సతీశ్, శ్రీకాంత్, హరీశ్, మాజీ ఎంపీటీసీలు వెంకట లక్ష్మీరఘురాములు, దాసోజు స్వర్ణలత వీరబ్రహ్మం, శ్రీనివాస్, ఉదయ భాస్కర్, డాక్టర్ లింగమూర్తి, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు నాగరాజు, తాటికొండ స్వామి మహేశ్, సురేశ్ తదితరులున్నారు.

ఓపెన్ జిమ్ ఏర్పాటుకు రూ.లక్ష విరాళం

ఓపెన్ జిమ్‌కు విరాళం అందజేస్తున్న కంఠారెడ్డి తిరుపతిరెడ్డి

నిజాంపేట, జూలై 13: ఆరోగ్యవంతమైన జీవనానికి వ్యాయమం అవసరమని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి అన్నారు. శనివారం నిజాంపేటలోని తెలంగాణ క్రీడా ప్రాంగణంలో ఏర్పాటు చేస్తున్న ఓపెన్ జిమ్‌కు తనవంతుగా రూ.లక్ష విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా తిరుపతిరెడ్డి మాట్లాడుతూ ప్రతిఒక్కరూ నిత్యం వ్యాయామం చేస్తే ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడుతుందన్నారు. ఓపెన్ జిమ్‌ను వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో రామాయంపేట మున్సిపాల్ చైర్మన్ జితేందర్‌గౌడ్, బీఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షుడు మావురం రాజు, పీఏసీఎస్ చైర్మన్లు కొండల్‌రెడ్డి, బాపురెడ్డి, చంద్రం, మాజీ ఎంపీటీసీలు చింతల స్వామి, బాల్‌రెడ్డి, వెంకటస్వామి, నాయకులు నాగరాజు, స్వామి, రాములు, కిష్టారెడ్డి, వెంకటేశం ఉన్నారు.

రూ.25 వేల విలువైన బోర్‌మోటర్ అందజేత

బోర్‌మోటర్‌ను ప్రారంభిస్తున్న పీఏసీఎస్ చైర్మన్ వెంకటరాంరెడ్డి

శివ్వంపేట, జూలై 13: మండలంలోని కొంతాన్‌పల్లి గ్రామంలో నీటి సమస్య ఉండడంతో పీఏసీఎస్ చైర్మన్ వెంకట్రాంరెడ్డి రూ.25వేల సొంత ఖర్చులతో బోర్‌మోటర్ అందజేశారు. శనివారం గ్రామంలో బోర్‌మోటర్‌ను ప్రారంభించారు. ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని, సమస్యను పరిష్కరిస్తానన్నారు. కార్యక్రమంలో చెల్ల వెంకటేశ్, వీరబోయిన భిక్షపతి, స్వామి, అశోక్ గౌడ్, సాన శంకర్, రవీందర్ ఉన్నారు.

మండల సర్వేయర్‌కు నంది నేషనల్ అవార్డు

నంది అవార్డును అందుకుంటున్న మండల సర్వేయర్ రవిప్రసాద్ శర్మ

చిలిపిచెడ్, జూలై 13: సామాజిక స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో 16 ఏండ్లుగా సేవ చేస్తున్న సర్వేయర్ డాక్టర్ గంటంబొట్ల రవిప్రసాద్ శర్మకు భారతీయ నంది నేషనల్ అవార్డు అందజేసినట్లు సంస్థ చైర్మన్ రమేశ్ తెలిపారు. సామాజిక సేవలు గుర్తించిన సర్వీసెస్ సొసైటీ ఇండియా ఎన్జీవో, స్ఫూర్తి ఇంటర్నేషనల్ వర్డల్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఆధ్వర్యంలో రాష్ట్ర సారస్వత పరిషత్ హాల్‌లో గౌరవ అవార్డ్స్‌ను శనివారం అందజేశారు. శర్మకు అవార్డు రావడంతో ఎంప్లాయిస్, సామాజిక సంస్థల కమిటీ సభ్యులు, గ్రామస్తులు అభినందించారు.

చెరువు అలుగు మీది మట్టిని తొలిగించండి

నర్సాపూర్, జూలై 13: రెడ్డిపల్లి గ్రామంలోని పెద్ద చెరువు అలుగు మీది మట్టిని తొలిగించాలని రెడ్డిపల్లి, పెద్దచింతకుంట, చిన్న చింతకుంట గ్రామానికి చెందిన పంచాయతీ కార్యదర్శులకు నీటి పారుదల శాఖ ఉప కార్యనిర్వహణ అధికారి బుచ్చిబాబు శనివారం నోటీసులు జారీచేశారు. అలుగుపై మట్టి ఉండడంతో పైన పంట పొలాలు ముంపునకు గురై రైతులు నష్టపోతున్నారని పేర్కొన్నారు. వారికి తగు న్యాయం చేయాలని కోరారు.

పాస్నెట్ ప్రీమియర్ లీగ్ విజేత ఆల్ఫా టీమ్

మెదక్ మున్సిపాలిటీ, జూలై 13: మెదక్ చర్చి కాంపౌండ్‌లో మొదటిసారి నిర్వహించిన పాస్నెట్ ప్రీమియర్ లీగ్ -1 పోటీల్లో విజేతగా ఆల్ఫా టీమ్ నిలిచింది. శనివారం నిర్వహించిన ప్రీమియర్ లీగ్‌లో 8 జట్లు పాల్గొనగా ఫైనల్‌లో ఆల్ఫా టీమ్, విట్టకర్ ఎలెవన్ జట్లు పోటీ పడ్డాయి. పోటీలకు ఆర్గనైజర్లుగా సుశీల్, మాని, చింకు వ్యవహరించారు.